RNI NO: APTEL/26/A5325

www.mahinewsindia.com

మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 01 | సంచిక : 65 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. | పేజీలు : 4 | వెల రూ.2 | ఆదివారం -23 - ఆగస్టు - 2026

Published From :Chittoor circulated by YSR Kadapa I Anatapuram I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై.. ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు!

- లాంచ్ వెహికల్స్ తయారీ నుంచి క్రమంగా తప్పుకోనున్న ఇస్రో
- ప్రైవేట్ రంగానికి రాకెట్ల తయారీ, ఉత్పత్తి బాధ్యతలు
- ఎస్ఎస్ఎల్‌వీ టెక్నాలజీ, ఉత్పత్తి హక్కులు ఇప్పటికే హెచ్ఏఎల్‌కు బదిలీ
- తదుపరి దశలో పీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం3 తయారీ
- ఇకపై ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి

షెహబాజ్‌కు ముప్పేట ముప్పు.. పాక్ రాజకీయాల్లో కొత్త సమరం!

షెహబాజ్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పి

- పీపీపీ ప్రభుత్వ బిల్లులకు మద్దతు నిలిపివేస్తామని హెచ్చరిక
- పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎన్నికలపై పీపీపీ న్యాయపోరాటానికి సిద్ధం
- కొత్త రాష్ట్రాల అంశంపైనా మిత్రపక్షాల మధ్య విభేదాలు

యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

- శక్తిమంతంగా, గౌరవంగా ఉన్నప్పుడే ముగించడం మేలని వ్యాఖ్య
- అమెరికాను ప్రపంచమంతా ద్వేషిస్తోందన్న పెజెష్కియాన్
- కొనసాగుతున్న ప్రతిష్టంభన.. మధ్యవర్తిత్వం చేస్తున్న ఒమన్

నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సిద్ధం

- ★ వెలిగొండపై సీఎం చంద్రబాబు
- ★ ఆగస్టు 31న ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు సీఎం వెల్లడి
- ★ కూటమి ప్రభుత్వం 48 రోజుల్లో నిర్వాసితులకు రూ.768 కోట్ల పరిహారం చెల్లింపు
- ★ గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని సీఎం చంద్రబాబు విమర్శ
- ★ ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితుల హర్షం

అమరావతి: మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఆగస్టు 31వ తేదీన ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత పరిహారంగా మిగతా 2 లో

మాకు అంతకంటే ఎక్కువ టైమ్ ఇవ్వరు.. క్రికెట్ పై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- కుమారుడు దేవాన్ష్‌తో ప్రతి ఆదివారం క్రికెట్ ఆడతానన్న మంత్రి లోకేశ్
- విశాఖ చంద్రంపాలెం స్కూల్లో రూ. 6.48 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం
- కొత్తగా నిర్మించిన క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టుల ప్రారంభోత్సవం
- విద్యార్థులతో కలిసి సరదాగా వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఆడిన మంత్రి

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని విద్యార్థులతో



గొడ్డలి పార్టీ పాలనలో నకిలీ మద్యంతో 30 వేల మంది చనిపోయారు

- మెగా డీఎస్సీపై విమర్శలను తిప్పికొట్టిన సీఎం చంద్రబాబు
- రాజకీయ చెత్తను కూడా శుభ్రం చేయాలి
- ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుస్తాం
- ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్ కు సర్టిఫికెట్లు తీసుకురాకపోతే అది ఎవరితప్పు?: సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో గ్రూప్ 1 పేపర్లు స్టంబర్లతో దిద్దించారని ఆరోపణ

14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన ప్రత్యేక దృష్టి

- మంత్రులు, ఎంపీలతో జనసేన కమిటీ.. స్థానిక ఎన్నికలే లక్ష్యం
- ఎన్నికల వ్యూహాలు, మార్గదర్శకాల రూపకల్పన బాధ్యత
- కమిటీలో మంత్రి దుర్గేష్, ఎంపీ బాలశౌరికి చోటు

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, మిగతా 2 లో

ఎవరినీ వదిలిపెట్టేది లేదు

అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేస్తాం

- ఇక ఎవరినీ ఉపేక్షించం. ఈ భవనాలన్నీ నాలాల పక్కన ఉన్నాయి
- 50 గజాల్లోనే ఏడేసి అంతస్తులు కట్టారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలన్నీ కూలుస్తాం
- ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తులు బిల్డింగ్ నిర్మాణం

హైదరాబాద్: ఎవరినీ వదిలిపెట్టేది లేదని.. అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేస్తామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మిగతా 2 లో

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం కృషి

- యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలి
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలి
- తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దెవ్జీ సానుకూలంగా స్పందించారు

ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

కేంబ్రిడ్జ్ ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలి

- కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు గారు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం
- స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి
- హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి ఇది మరింత బలం

హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఈ బృందం తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించింది. సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మిగతా 2 లో

జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్? కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

- రేవంత్ రెడ్డి అమెరికా టూర్‌కు కేంద్ర అనుమతి నిరాకరణ
- జేడీ వాన్స్, మమ్దానీలతో సమావేశానికి రేవంత్ ప్లాన్ చేసినట్లు సమాచారం
- ఆ విషయాన్ని విదేశాంగ శాఖకు వెల్లడించలేదని సమాచారం
- అందుకే అనుమతి నిరాకరించినట్లు ఎన్‌డీటీవీ కథనం

ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఈ బృందం తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించింది. సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు , ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ప్రపంచ అత్యుత్తమ విద్యా సంస్థలకు ఉన్న అవకాశాలను వివరించి, ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని కేంబ్రిడ్జ్ ప్రతినిధులను ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు గారు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అవకాశాలపై సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తల ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకారంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి. కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి ఇది మరింత బలం చేకూర్చనుంది.

జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్? కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీలతో భేటీలు కూడా ఆయన పర్యటనలో భాగంగా ఉండటమే ఇందుకు కారణంగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు ఎన్డీటీవీ పేర్కొంది. అమెరికా, బ్రిటన్ పర్యటనలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కోరింది. బ్రిటన్ పర్యటనకు అంగీకరించిన కేంద్రం అమెరికా టూర్‌కు మాత్రం అనుమతి నిరాకరించింది. అమెరికా పర్యటనలో జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీలను ప్రతిపాదించినప్పటికీ.. ఈ కార్యక్రమాలను విదేశాంగ శాఖతో చర్చించలేదని, రాజకీయ అనుమతి ప్రక్రియలో భాగంగా సమాచారం పంపలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చే ముందు ముఖ్యమంత్రి వంటి ప్రజాప్రతినిధుల ప్రతిపాదిత కార్యక్రమాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుంది. పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమాలు ఉన్నాయా? అన్నది పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తుంది. ఈ అంశంపై శుక్రవారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. రేవంత్‌రెడ్డి బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని, అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలు కొన్ని ప్రమాణాలకు తగినవిగా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలు సరిపోలకపోవడంతో అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్య భారీగా ఉండటంతో రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాలోని భారతీయ అమెరికన్లలో తెలుగు సమాజం సుమారు 14 శాతం ఉంటుందని, 12 లక్షలకు పైగా తెలుగు ప్రజలు అక్కడ ఉన్నారని సమాచారం. అయితే ఈ వ్యవహారం తెలంగాణలో రాజకీయ వివాదానికి దారితీసింది. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించి, బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వడంపై ప్రశ్నలు తలెత్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ నిర్ణయం రాజకీయ కక్షతో తీసుకున్నది కాదని, కేవలం సాంకేతిక అంశాల ఆధారంగానే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినట్లు చెబుతున్నాయి.

మాకు అంతకంటే ఎక్కువ టైమ్ ఇవ్వరు.. క్రికెట్ పై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని, ప్రతి ఆదివారం తన కుమారుడు దేవాన్ష్‌తో కలిసి రెండు, మూడు గంటల పాటు తప్పనిసరిగా క్రికెట్ ఆడతానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు అంతకంటే ఎక్కువ సమయం ఇవ్వరంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు విరిసాయి. విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ తన క్రికెట్ ఇష్టాన్ని బయటపెట్టారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో రూ. 6.48 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తగా నిర్మించిన క్రికెట్ గ్రౌండ్, వాలీబాల్ కోర్ట్, బాస్కెట్‌బాల్ కోర్ట్, వాకింగ్ ట్రాక్‌తో పాటు ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను కూడా ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవాల అనంతరం మంత్రి లోకేశ్ విద్యార్థులతో కలిసిపోయారు. వారితో కలిసి సరదాగా వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. ఈ పాఠశాలకు రావడం ఇది మూడోసారని, వచ్చిన ప్రతిసారీ భారీ వర్షం కురుస్తుందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఈ స్కూల్ పేరు వింటేనే నాకు వాన గుర్తొస్తుంది. నా నియోజకవర్గం మంగళగిరిలోని స్కూల్‌కు కూడా నేను మూడుసార్లు వెళ్లలేదు" అని ఆయన అనడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి రాక సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

షెహబాజ్‌కు ముప్పేట ముప్పు.. పాక్ రాజకీయాల్లో కొత్త సమరం!

ఢిల్లీ: పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. కీలక మిత్రపక్షమైన 'పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ' (పీపీపీ)తో విభేదాలు ముదురుతుండగా, ప్రతిపక్షాలు ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్నాయి. మరోవైపు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వైద్య చికిత్స వ్యవహారం కూడా ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెడుతోంది. ఆగస్టు 18న ఇమ్రాన్‌ను అడియాలా జైలు నుంచి రెండు రోజుల్లో ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ ఆసుపత్రికి తరలించాలని పాక్ సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఈ ఉత్తర్వులపై పునర్విచారణ కోరింది. భద్రతా కారణాలతో షిఫాకు బదులుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని పిమ్స్ ఆసుపత్రికి తరలించింది. వైద్య పరీక్షల తర్వాత కొన్ని గంటల్లోనే మళ్లీ జైలుకు పంపింది. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పాటించలేదంటూ ఇమ్రాన్ కుటుంబం, పీటీఐ ఆరోపించాయి. ఈ వ్యవహారం కోర్టు ధిక్కార కేసుకు దారితీసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో పీపీపీ అధినేత బిలావల్ భుట్టో జర్దారీ ప్రభుత్వం తీరుపై కఠిన వైఖరి తీసుకున్నారు. తమ అభ్యంతరాలు పరిష్కరించే వరకు సెనేట్, జాతీయ అసెంబ్లీలో ప్రభుత్వ బిల్లులకు మద్దతు ఇవ్వబోమని ప్రకటించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించిన పీపీపీ.. ఫలితాలను న్యాయస్థానంలో సవాల్ చేయాలని నిర్ణయించింది. కొత్త రాష్ట్రాల ఏర్పాటుపైనా విభేదాలు తలెత్తాయి. విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం లేకుండా ప్రభుత్వం ముందుకు సాగొద్దని బిలావల్ స్పష్టం చేశారు. మరోవైపు ప్రతిపక్షాలు కూడా ఐక్యంగా కదులుతున్నాయి. జేయూఐ-ఎఫ్ అధినేత మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ నేతృత్వంలో ఉమ్మడి పార్లమెంటరీ వ్యూహంపై చర్చలు సాగుతున్నాయి. సోమవారం కీలక ప్రతిపక్ష సమావేశం జరగనుంది. పీపీపీ మద్దతు దొరికితే షెహబాజ్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం దిశగా పరిణామాలు వేగంగా మారే అవకాశముంది.

రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై.. ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు!

ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై లాంచ్ వెహికల్స్ తయారీ, సాధారణ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించనుంది. ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి, శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టి పెట్టనుంది. బిజినెస్ టుడే నిర్వహించిన ఇండియా ఏ 100 ఎకానమీ సమ్మిట్‌లో ఇన్‌స్పేస్ ఛైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. "ఇస్రో ఇకపై ఎలాంటి లాంచ్ వెహికల్స్‌ను తయారు చేయదు. వాటి తయారీని ప్రైవేట్ రంగం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపడతాయి" అని ఆయన తెలిపారు. ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు బదిలీ చేశారు. తదుపరి దశలో భారత్ ప్రధాన రాకెట్లైన పీఎస్ఎల్వీ (పీఎస్ఎల్వీ), ఎల్వీఎం-3 (ఎల్వీఎం3) సాంకేతికత, తయారీ కూడా ప్రైవేట్ రంగానికి బదిలీ చేసే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లు గోయెంకా తెలిపారు. ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. కొత్త సాంకేతికతలు, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తర్వాత దానిని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా చెప్పారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త లాంచ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఆపరేటర్‌ను వచ్చే నాలుగు లేదా ఐదు నెలల్లో ఖరారు చేసే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న సుమారు 8 బిలియన్ డాలర్ల నుంచి 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వ డిమాండ్, అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాల్లో విస్తృతంగా వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో భారత సంస్థల విస్తరణ కీలకమని గోయెంకా చెప్పారు. ప్రభుత్వం ప్రధాన కస్టమర్‌గా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ ఇప్పటికే ప్రైవేట్ సంస్థలకు 31 ఉపగ్రహాల తయారీకి ఆర్డర్ ఇచ్చిందని, ఇదే విస్తృత కార్యక్రమంలో భాగంగా మరో 21 ఉపగ్రహాలను ఇస్రో తయారు చేయనుందని తెలిపారు.

నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

మొదటి పేజి తరువాయి

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత పరిహారంగా రూ.250 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

48 రోజుల్లోనే రూ.768 కోట్ల పరిహారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 48 రోజుల్లోనే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. మూడు విడతల్లో మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు అందించగా, శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు సీఎం చేతుల మీదుగా అందజేశారు. నిర్వాసితులకు ఇంకా రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తయితే 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

గత ప్రభుత్వ డ్రామాలతోనే ఆలస్యం: సీఎం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "1996లో నేనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేశాను. ఇప్పుడు 2026లో నా చేతుల మీదుగానే ప్రారంభించడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి మొదటి దశ పనులు పూర్తి చేశాం" అని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నా, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీరు రాకపోయినా, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. "వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2021లోనే పూర్తి కావాల్సింది. కానీ గత పాలకుల డ్రామాల వల్ల ఆలస్యమైంది. వారు రాష్ట్రాన్ని ఆర్థికంగా చిదిమేశారు. అయినా 'సూపర్ సిక్స్' వంటి పథకాలను అమలు చేస్తూనే, ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం" అని విమర్శించారు. గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా దేశంలో నీటి భద్రత సాధించవచ్చని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు అందిస్తామని, సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు తమ ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

పరిహారంపై నిర్వాసితుల హర్షం

ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమను ఇబ్బందులు పెట్టిందని, కూటమి ప్రభుత్వం ఆదుకుందని రైతు కాశిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ప్రారంభించడం సంతోషంగా ఉందని మరో నిర్వాసితుడు బోగెం శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం తమకు పూర్తి పరిహారం అందించి, కాలనీల్లో మంచి వసతులు కల్పించిందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం కృషి

హైదరాబాద్: తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో 900 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లోవాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' విజన్‌ను వారికి సమగ్రంగా వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి గారు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి గారు చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారి చిత్రపటాన్ని తిలకించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్‌విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే. అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ ఛైర్మన్ కిరణ్ కుమార్ గ్రంధి గారితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్స్‌తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి గారు జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్‌తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. ప్రస్తుత ప్రీమియర్ లీగ్ చాంపియన్స్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే ఈపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు.

గొడ్డలి పార్టీ పాలనలో నకిలీ మద్యంతో 30 వేల మంది చనిపోయారు

అమరావతి: మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు బురద జల్లే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 సర్వీస్ పరీక్షల మూల్యాంకనంలో భారీ అవకతవకలు జరిగాయని, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇంట్లో పనిచేసేవారితో సమాధాన పత్రాలు దిద్దించిన వాస్తవాలు వెలుగు చూస్తుండటంతో, ఇప్పుడు డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలమండ కోడూరులో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 300 పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ ఎదుర్కొని ఉద్యోగాలు ఇస్తుంటే, ఏడాది తర్వాత ఆరోపణలు చేస్తున్నారు. ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తేకపోతే అదెవరి తప్పు? క్రీడా కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచి ఉద్యోగాలిస్తే, ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారమే క్రీడాకారులకు ప్రాధాన్యం ఇచ్చాం. ఎవరో ఎక్కడో డబ్బులు అడిగారని మొత్తం డీఎస్సీకి అంటగట్టడం దుర్మార్గం. గొడ్డలి పార్టీ అధినేత వేప వందల కోట్లు సంపాదించారు, దాని గురించి ఎవరూ మాట్లాడరేం?" అని నిలదీశారు. తప్పు చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఐదేళ్ల పాటు గొడ్డలి పార్టీ విధ్వంసాలు, నేరాలు, ఘోరాలనే నమ్ముకుంది. వారి హయాంలో సరఫరా చేసిన నకిలీ మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది అనారోగ్యంతో చనిపోయారు. కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి, తమకు నచ్చని వారి భూములను 22ఏ జాబితాలో పెట్టారు. ఆ దుర్మార్గాలను సరిదిద్దడానికే మాకు మూడేళ్ల సమయం పడుతోంది. ఇప్పుడు మేం ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి-మీ హక్కు' పేరుతో రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచారు" అని చంద్రబాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రెండింతల సంక్షేమం అందిస్తూనే అభివృద్ధి పనులు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "గత పాలకులు సంక్షేమం ఇస్తున్నామని చెప్పి రోడ్లు కూడా వేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక రోడ్ల రూపురేఖలు మార్చాం. ప్రజలు ఈ చెత్తతో పాటు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలదే. అప్పుడే రాజకీయ నేతలూ తప్పులు చేయరు" అని పిలుపునిచ్చారు. 'దీపం 2.0' ద్వారా నాలుగు నెలలకు ఒకసారి మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను ఆడబిడ్డల ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో ఇప్పుడు ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు విద్యార్థులు వస్తున్నారని, ప్రపంచాన్ని జయించే విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి మన ఉపాధ్యాయులకు ఉందని అన్నారు. ప్రతి గ్రామం 'జీరో వేస్ట్' గ్రామంగా మారాలని ఆకాంక్షించారు. "రెండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశాం. చెత్త నుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నాం. స్వచ్ఛ రథాల ద్వారా చెత్త సేకరించి, నిత్యావసర సరుకులు అందిస్తున్నాం. 'స్వయం' పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం" అని వివరించారు. ఈ సందర్భంగా పలు హామీలు ఇచ్చారు. 30 ఏళ్ల క్రితం ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ప్రారంభిస్తున్నామన్నారు. వచ్చే నెలలోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరందిస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని, 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ నిర్మిస్తామని చెప్పారు. స్థానిక యువతకు స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్యాలు అందిస్తామన్నారు. రూ.29 కోట్లతో ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులు, రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు మంచి చెడులను విశ్లేషించి, మంచి ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు.

యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

ఢిల్లీ: అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "మనం శక్తిమంతంగా, గౌరవంగా ఉన్న ఈ సమయంలోనే యుద్ధానికి ముగింపు పలకడం ఉత్తమం" అని పెజెష్కియాన్ అన్నారు. ఈ పోరాటంలో ఇరాన్ విజయం సాధించిందని ప్రపంచం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి అమెరికా పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు చేస్తోందని, అందుకే ప్రపంచవ్యాప్తంగా అమెరికా పట్ల ద్వేషం పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ ఏడాది ఆరంభంలో అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ప్రారంభమైన ఈ సంఘర్షణ, ప్రస్తుతం ప్రతిష్టంభనలో కొనసాగుతోంది. హార్ముజ్ జలసంధిలో ఇబ్బందులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు, వాషింగ్టన్ ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేస్తూ కొత్త ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. చర్చలకు మార్గం సుగమం చేసేందుకు ఒమన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. జూన్‌లో అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందంలో ఇరాన్ లొంగిపోయినట్లు ఎలాంటి నిబంధనలు లేవని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు తలొగ్గేది లేదని, అవసరమైతే గట్టిగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దేశంలో ఆర్థిక ఒత్తిళ్లు, అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో, శక్తిమంతమైన స్థితి నుంచే తాము శాంతి చర్చలకు సిద్ధమనే సంకేతాలు పంపేందుకే టెహ్రాన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎవరినీ వదిలిపెట్టేది లేదు

హైదరాబాద్: ఎవరినీ వదిలిపెట్టేది లేదని.. అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని కూల్చేస్తామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కూలిన భవనాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇక ఎవరిని ఉపేక్షించం. ఈ భవనాలన్నీ నాలాల పక్కన ఉన్నాయి. 50 గజాల్లోనే ఏడేసి అంతస్తులు కట్టారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలన్నీ కూలుస్తాం. భవనాలు అన్ని నాలాను ఆనుకునే నిర్మించారు. బిల్డర్ సాజిద్ పరారీలో ఉన్నాడు. 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లకు ఇస్తున్నాడు" అని రంగనాథ్ తెలిపారు. ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతి చెందారు. బిల్డింగ్ యజమాని అందుబాటులోకి రాలేదు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు ఇచ్చారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తులు బిల్డింగ్ నిర్మాణం జరుగుతుంది. నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. చుట్టుపక్కల ఉన్న భవనాలను కూడా పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తాం. హాస్టల్ బిల్డింగులు నిర్మించి రెంట్‌కు ఇస్తుంటాడు సాజిద్.. అతనిపై ఇప్పటికే చాలా ఫిర్యాదులు ఉన్నాయి" అని రంగనాథ్ పేర్కొన్నారు.

14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, మార్గదర్శకాలను రూపొందించేందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 14 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం అమరావతి నుంచి ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి వంటి కీలక నేతలకు చోటు కల్పించారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సి.హెచ్. వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పాట్సమట్ల ధర్మరాజు సభ్యులుగా నియమితులయ్యారు. వీరితో పాటు ఎంఎస్ఎంఈ ఛైర్మన్ టి. శివశంకర్, చిలకం మధుసూదన్ రెడ్డి, కోటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కోరికాన రవికుమార్‌లను కమిటీలో సభ్యులుగా నియమించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాల ఖరారు వంటి కీలక బాధ్యతలను ఈ కమిటీ పర్యవేక్షించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

టారిఫ్‌లతోనే అమెరికా ధనిక దేశంగా మారింది

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన టారిఫ్‌ల (సుంకాలు) విధానాన్ని బలంగా సమర్థించుకున్నారు. దిగుమతులపై విధించిన సుంకాల వల్లే అమెరికా అత్యంత ధనిక దేశంగా మారిందని, విదేశీ కంపెనీలు తమ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. సౌత్ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. "నాకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్. ఆ పదాన్ని నేను ప్రేమిస్తున్నాను. అది మనల్ని విపరీతంగా ధనవంతుల్ని చేసింది" అని వ్యాఖ్యానించారు. సుంకాల విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, అమెరికన్లకు ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయని ఆయన తెలిపారు. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు తాను ఒకటే చెబుతున్నానని ట్రంప్ అన్నారు. "అమెరికాకు కార్లను ఎగుమతి చేయాలంటే 25 శాతం సుంకం కట్టాలి. అది సాధ్యం కాదంటే, ఇక్కడికే వచ్చి మీ కార్ల ఫ్యాక్టరీలను నిర్మించుకోవాలి. ఇప్పుడు సౌత్ కరోలినాలో అదే జరుగుతోంది" అని ఆయన వివరించారు. ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ పెట్టుబడులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల అమెరికాలోకి సుమారు 19.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని ట్రంప్ తెలిపారు. దేశవ్యాప్తంగా వందల, వేల సంఖ్యలో ఫ్యాక్టరీలు నిర్మిస్తుండటంతో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు భారీగా పెరిగాయని అన్నారు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే తాను తెచ్చిన పన్ను, వాణిజ్య విధానాలు తలకిందులవుతాయని, పన్నులు పెరిగి, ఉద్యోగాలు పోతాయని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల నియంత్రణ కొనసాగేందుకు తమ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త.. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ వచ్చేసింది!



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. మొత్తం 10,060 పోస్టుల భర్తీకి సంబంధించిన వార్షిక జాబ్ క్యాలెండర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ మేరకు ఖాళీల భర్తీకి రాష్ట్ర ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఒకేసారి కాకుండా, ప్రణాళికాబద్ధంగా 4 దశల్లో భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉద్యోగార్థులు సన్నద్ధమయ్యేందుకు వీలుగా నోటిఫికేషన్ల షెడ్యూల్‌ను కూడా ముందుగానే ప్రకటించింది. దీని ప్రకారం, ఉన్నత విద్యాశాఖ పరిధిలో ఇప్పటికే 1,500 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. మిగిలిన పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్లను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో విడుదల చేయనున్నారు. సెప్టెంబర్ 15న 3,231 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆ తర్వాత అక్టోబర్ 15న రెండు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 5,306 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో భాగంగా ఒక నోటిఫికేషన్‌లో 2,311 పోస్టులు, మరో నోటిఫికేషన్‌లో 2,995 పోస్టులు ఉంటాయి. దశలవారీగా నోటిఫికేషన్లు విడుదల చేసి, అక్టోబర్ మధ్య నాటికి మొత్తం 10,060 పోస్టుల నియామక ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్యాలెండర్‌కు అనుగుణంగా అభ్యర్థులు సన్నద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏ పార్టీలో ఉన్న వాళ్లు ఇదే లొల్లి, కొండ సురేఖ ఫ్యామిలీ పై సారయ్య ఫైర్

వరంగల్ జిల్లా, ఆగస్టు 22 . : మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యా?ల వివాదం నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీలో ఏ సందర్భంలోనూ వివాదాలు లేకుండా ఉండలేరని, ప్రతిసారీ బీసీ కార్డు ప్రయోగించడం ఆ కుటుంబానికి అలవాటు అయిందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సహా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో కొండా ఫ్యామిలీ వివాదం తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరే కంగా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భగ్గుమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, పార్టీ నాయకత్వంపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా తప్పుబట్టారు. సారయ్య మరియు ఇతర నేతల ఫైర్ అడిగిందల్లా ఇవ్వడానికి టికెట్లు చాక్లెట్లా, బిస్కెట్లా అంటూ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కొండా కుటుంబాన్ని నిలదీశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలోనూ కొండా కుటుంబానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఇతర కాంగ్రెస్ నేతల కు మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఇటీవల కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీ యాల్లో, కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపడంతో పార్టీ హైక మాండ్ మరియు స్థానిక నాయ కులు కొండా కుటుంబం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రు. కొండా కుటుంబంపై కాంగ్రెస్ నేతల విమర్శలు.

విద్యార్థులే లక్ష్యంగా గంజాయి చాక్లెట్ల విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు.

హైదరాబాద్ జిల్లా, ఆగస్టు 22, .: విద్యార్థులే లక్ష్యంగా గంజాయి చాక్లెట్ల విక్రయాలకు పాల్పడుతు న్న ముఠాను పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఓ మహిళ కూడా ఉంది. నగరంలో దాదాపు 23 కిలోల గంజాయి చాక్లెట్లను కుత్బుల్లాపూర్ జోన్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ చాకెట్లను మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తు న్నట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థులే లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు జరుపుతున్నట్లు విచారణలో బయటపడింది. గాజులరామారం, మహాదేవ పురంకు చెందిన ముగ్గురు యువకులతో పాటు ఓ లేడీని ఎస్వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురు నిందితులను జగద్గిరిగుట్ట పోలీసులకు అప్ప గించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఎవరి దగ్గర నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేశారు? దీని వెనకాల ఎంతమంది ఉన్నారనే దానిపై పోలీసులు ముమ్మ రంగా విచారణ చేస్తున్నారు.

హైదరాబాద్‌లో దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధుల తో ఏర్పాటైన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్‌ను ప్రారంభించిన భట్టి విక్రమార్క మల్లు.

తెలంగాణ, ఆగస్టు 22, .: ప్రజాస్వామ్య మనుగడకు పాల కులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని, విమర్శల ను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాల కు ఉండాలని ఆయన అన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి వరకు ప్రజా చైత న్యంలో జర్నలిజం కీలక పాత్ర పోషించిందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, లోకమాన్య తిలక్ వంటి మహ నీయులు పత్రికలను సామాజిక, రాజకీయ మార్పుకు సాధనాలు గా మలిచారని పేర్కొన్నారు. ఈ కాలంలో సమాచార కొరత లేదు.. నమ్మకం కొరత ఉంది" అని ఆయన అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న సమయంలో జర్నలిస్టుకు అత్యంత విలువైన ఆస్తి విశ్వసనీయత అని స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లా, గ్రామీ ణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్న లిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తూ ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ'గా పనిచేస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం,

ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమం, వృత్తిపరమైన ప్రమా ణాల పరిరక్షణకు ఫెడరేషన్ ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిం చారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నిస్తూ, అదే సమయంలో తమ వృత్తి ప్రమాణాలను కూడా కాపాడుకోవాలని జర్నలిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. పాలకులను జవాబుదారీగా ఉంచడంతో పాటు, జర్నలిస్టులు తమను తాము వృత్తి ప్రమాణా లకు జవాబుదారీగా ఉంచుకోవా లని అన్నారు. తెలంగాణ గడ్డ స్వభావంలోనే స్వేచ్ఛగా మాట్లాడే ప్రశ్నించే సంప్రదాయం ఉందని భట్టి విక్రమార్క పేర్కొ న్నారు. తమతో విభేదించే గొంతుకలను వినే ధైర్యం ప్రజా జీవితంలో ఉన్నవారికి ఉండాల ని అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిర క్షణకు బలమైన వేదికగా ఎదగా లని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

చిలకలూరిపేట పట్టణంలోని రోహిణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ

సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పల్నాడు జిల్లా చిలకలూరి పేట:ఆగస్టు-22.జిల్లా ప్రతినిధి:- చిలకలూరిపేట పట్టణ పోలీసులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఐ. రమేష్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. టౌన్ ఎస్సై హజరత్తయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

చెప్పాల్సింది కమిటీకి చెప్పా.. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మాట్లాడతా', కొండా సురేఖ ఇంట్రెస్టింగ్ కామెంట్స్.

తెలంగాణ,ఆగస్టు 22, : కొండా సుస్మిత చుట్టూ కొనసాగు తున్న వివాదంపై కొండా సురేఖ మరోసారి మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు ఇప్ప టికే సమాధానం ఇచ్చానని తెల్పి చెప్పారు. కమిటీకి అన్ని విషయాలు వివరించానని, కొత్తగా మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత పూర్తి వివరాలు మాట్లాడతానని వెల్లడించారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమైనవని.. తనకు సంబంధం లేదని ఇప్పటికే క్రమ శిక్షణ కమిటీకి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తెలంగాణ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న కొండా సురేఖ-కొండా సుస్మిత వివాదంపై మంత్రి కొండా సురేఖ మరోసారిస్పందించారు. అయితే ఈసారి పూర్తి వివరాలు వెల్లడించకుండా ఆమె ఆచితూచి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై తాను చెప్పా ల్సిన విషయాలన్నీ ఇప్పటికే కమిటీకి వివరించానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ అంశంపై మీడియాతో మాట్లాడేందుకు ఏమీ లేదని తెల్పి చెప్పారు. శుక్రవారం తన నివాసంలో మీడియా ప్రతినిధులతో కొద్ది సేపు చిట్‌చాట్ చేసిన మంత్రి కొండా సురేఖ, ఇంట్లో జరుగు తున్న ప్రత్యేక పూజా కార్యక్రమం లో తాను బిజీగా ఉన్నానని చెప్పారు. ఇప్పుడు కొత్తగా చెప్పా ల్సిన విషయాలేమీ లేవని. ప్రస్తు తం విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి. తిరిగి వచ్చిన తర్వాత మాట్లాడతానని పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలి సిందే. కొండా సుస్మిత వ్యాఖ్య లపై కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు. మంత్రి కొండా సురేఖపై కూడా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు తీవ్ర విమర్శలు చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని కూడా డిమాండ్లు వినిపించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనికి ఆమె ఇప్పటికే లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్య లకు తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలు అని వివర ణలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఈ వివాదంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సొంత పార్టీకి చెందిన మంత్రి కుటుంబం నుంచే ముఖ్యమంత్రిపై బహిరం గ విమర్శలు రావడం పార్టీ అధి ష్టానాన్ని కూడా ఆందోళనకు గురిచేసింది.

తెలంగాణలో ప్రపంచస్థాయి విద్య.. ఆక్స్‌ఫర్డ్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానించిన సీఎం

తెలంగాణ, ఆగస్టు 12, .: తెలంగాణను ప్రపంచస్థాయి విద్య, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ ఆక్స్‌ఫర్డ్ వర్సిటీని హైదరాబాద్ ఆహ్వానించారు. లండన్ పర్యటనలో భాగంగా.. ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్లతో శుక్రవారం సమావేశమైన సీఎం. తెలంగాణ రైజింగ్ విజన్‌ను వివరించి ఎగ్జి క్యూటివ్ ఎడ్యుకేషన్, పరిశో ధన, నైపుణ్యాభివృద్ధి కార్యక్ర మాలను రాష్ట్రంలో విస్తరించాలని కోరారు. హైదరాబాద్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించారు. అందుకు ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులు సానుకూ లంగా స్పందించినట్లు సీఎంవో అధికారులు తెలిపారు. తెలంగాణను ప్రపంచ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేం దుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అందులో భాగంగా. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతి నిధులకు ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో శుక్రవారం 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ యూని వర్సిటీని సందర్శించింది. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృ తంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లోవా ట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బెలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్‌ను వారికి సమగ్రం గా వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభు త్వం రూపొందిస్తున్న ప్రణాళిక లు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివ ర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యు కేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృ తమైన విద్యా వ్యవస్థను హైదరా బాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి. తెలంగాణ యువ తకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యా లయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణు లతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానిం చింది. అనంతరం ముఖ్యమంత్రి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారి చిత్రపటాన్ని తిల కించారు.

ఆగస్టు 22న తెలంగాణ బంద్.. పిలుపునిచ్చిన ఓయూ జేఏసీ

తెలంగాణలో ఆగస్టు 22న ఓయూ జేఏసీ బందుకు పిలుపు

తెలంగాణ, ఆగస్టు 22, : ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తాజాగా మోండా మార్కె ట్‌లో మార్వాడీలు దళితుడిపై దాడి చేయడాన్ని ఖండిస్తూ ఓయూ జేఏసీ బందుకు పిలుపు నిచ్చింది. ప్రజలందరూ దీనికి మద్దతిచ్చి. బందును విజయ వంతం చేయాలని కోరుతున్నా రు. మార్వాడీలు తెలంగాణలో ఉపాధి అవకాశాలను కొల్లగొడు తున్నారని, స్థానికులపై దాడుల కు పాల్పడుతున్నారని ఓయూ జేఏసీ ఆరోపిస్తోంది. అయితే మార్వాడీ ఉద్యమానికి కొందరు మద్దతిస్తుండ గా. మరి కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఆవివరాలు, తెలంగాణలో మరోసారి బందు కు సంబంధించిన ప్రకటన వెలువడింది. ఆగస్టు 18న మార్వాడీ లకు వ్యతిరేకంగా ఆమనగల్లు ప్రాంత వ్యాపారస్తులు బందుకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిం దే. ఇప్పుడు మరోసారి బందుకు పిలుపునిచ్చారు. ఆగస్టు 22న తెలంగాణ అంతటా బంద్ పాటించాలంటూ ప్రకటన వెలువడింది. ఓయూ జేఏసీ ఈ బందుకు పిలుపునిచ్చింది. మరి బందుకు కారణం ఏంటి. ఎందు కు అనే వివరాలు తెలియాలంటే ఆగస్టు 22న ఓయూ జేఏసీ తెలంగాణ బందుకు పిలుపుని వ్వడానికి ప్రధాన కారణం మార్వాడీల అంశం. తాజాగా మార్వాడీలు మోండా మార్కెట్ లో ఓ దళితుడిపై దాడి చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ ఈ నెల అనగా ఆగస్టు 22న తెలంగాణ బందుకు పిలుపునిస్తున్నట్లు ఓయూ జేఏసీ తెలిపింది. దీని గురించి ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ప్రకటన చేశారు. సోమవారం నాడు ఓయూ ఆర్ట్స్ కాలేజీ దగ్గర. మార్వాడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా తిరుపతి మాట్లాడుతూ. గుజరాత్, రాజస్తాన్ రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు తెలంగాణ కు వలస వచ్చి. ఇక్కడి కుల వృత్తులను దెబ్బతీస్తున్నారన్నారని ఆరోపించారు. ఒకప్పుడు తెలంగాణ. ఆంధ్ర పెత్తందారుల నుంచి బయటపడితే. ఇప్పుడు రాష్ట్రాన్ని మార్వాడీలు దోచుకుం టున్నారని మండిపడ్డారు. వారు ఇక్కడ ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్నారని ఆరోపించా రు. అక్కడితో ఆగకుండా స్థాని కులపై దాడులకు పాల్పడుతు న్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోండా మార్కెట్‌లో దళితుడిపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామని. ఇందుకు నిరసనగా ఆగస్టు 22న తెలంగాణ వ్యాప్తంగా బందు పాటించాలని ఆయన కోరారు. ఇక తెలంగాణలో మార్వాడీ గో బ్యాక్ ప్రచారం రాజకీయంగా ఉద్రిక్తంగా మారింది. కొందరు దీనికి మద్దతిస్తుండగా. మరి కొందరు మాత్రం వ్యతిరేకిస్తున్నా రు. బీజేపీ నేతలైన బండి సంజయ్, రాజాసింగ్‌లు మార్వా డీలకు మద్దతుగా నిలుస్తున్నా రు. బండి సంజయ్ మార్వాడీల కు మద్దతు తెలుపుతూ. ఇది హిందూ సమాజాన్ని చీల్చే కుట్ర అని ఆరోపించారు. మార్వాడీ గో బ్యాక్ అంటే. తాము మటన్, డ్రైక్లీనింగ్ పేరుతో వ్యాపారాలు నిర్వహిస్తున్న ఓ వర్గం వారు నిర్వహించే కుల వృత్తులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో మార్వాడీలు వ్యాపారం చేస్తూ సంపద సృష్టిస్తున్నారని తెలి పారు. వారు వారి వ్యాపా రాల గురించి తప్ప.. అధికారం కోసం ఎన్నడు పాకులాడలేదని తెలి పారు. అయితే పిడమర్తి రవి మార్వాడీ గో బ్యాక్ ఉద్యమానికి మద్దతిస్తున్నారు. తెలంగాణలో ఇకపై ఒక్క కొత్త మార్వాడీ షాపు పెట్టినా ఊరుకోమని హెచ్చరిం చారు. వారు తెలంగాణను వదిలి వెళ్లే వరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. వారు జీఎస్టీ కట్టరని, బిల్లు ఇవ్వరని.. తెలంగాణలో వ్యాపారం చేసి సంపాదించిన డబ్బును రాజ స్తాన్, గుజరాత్ రాష్ట్రాలకు తరలిస్తుంటారని ఆరోపించారు. వారు ఇచ్చే చందాలతోనే బీజేపీ బతుకుతోందని. అదుకే ఆ పార్టీ నేతలు వారికి మద్దతు ఇస్తున్నా రని విమర్శించారు. రాష్ట్రంలో మార్వాడి ఉద్యమం తెర మీద కు రావడానికి ప్రధాన కారణం. వీరికి వ్యతిరేకంగా వచ్చిన ఓ పాట. వకొన్ని రోజుల క్రితం గోరేటి రమేష్ అనే వ్యక్తి మార్వాడీల దోపిడీని వివరిస్తూ పాట పాడారు. అందుకు గాను పోలీసులు అతడిని అరెస్ట్ చేయడంతో ఇది కాస్త తీవ్ర రూపం దాల్చింది

అక్రమ భవనాల కూల్చివేతకు సవాలక్ష కారణాలు.. కూలీల ప్రాణాలు పోయాక మేల్కొంటారా?

- 50 గజాల్లో ఏడు అంతస్తులు.. మరో ఏడు అంతస్తుల భవనం నుంచి మెట్ల దారి!
- పట్టణ ప్రణాళిక అధికారుల నిర్లక్ష్యానికి నేడు అమాయక కూలీల ప్రాణాలు బలి
- అక్రమ నిర్మాణాలపై చర్యలకు వెనుకడుగు.. వసూళ్ల ఆరోపణలపై మౌనం ఎందుకు?
- అంజయ్యనగర్‌లో వరుస ఘటనలు.. అధికారుల తీరుపై ప్రజల తీవ్ర ఆగ్రహం

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం,ఆగస్టు 22 : : అక్రమ భవనాలను కూల్చివేయాల్సిన పట్టణ ప్రణాళిక అధికారులు సవాలక్ష కారణాలు చూపుతూ చర్యలను వాయిదా వేస్తుండగా.ఆ నిర్లక్ష్యానికి నేడు అమాయక కూలీల ప్రాణాలు బలయ్యాయనే ఆరోపణలు అంజయ్యనగర్‌లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. నిర్మాణ దశలోనే ప్రమాదకరంగా ఉన్న భవనాలపై సకాలంలో చర్యలు తీసుకుని ఉంటే ఈ దుర్ఘటనను నివారించగలిగేవారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పడిన జీహెచ్ఎంసీ సీఎంసీ సర్కిల్ 50, పరిధిలోని అంజయ్యనగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. 50 గజాల స్థలంలోనే ఏడు అంతస్తుల భవనం నిర్మించబడినట్లు, అంతేకాకుండా మరో ఏడు అంతస్తుల భవనం నుంచి మెట్ల దారిని ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంతటి భారీ నిర్మాణాలు జరుగుతున్న సమయంలో సంబంధిత పట్టణ ప్రణాళిక అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

కూలీల ప్రాణాలు ఖరీదా?

రోజువారీ కూలి కోసం నిర్మాణ పనులకు వచ్చే అమాయక కార్మికులు నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సిన దుస్థితి నెలకొన్నదని స్థానికులు అంటున్నారు. భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనుమతులకు అనుగుణంగానే అంతస్తులు నిర్మిస్తున్నారా? నిర్మాణ స్థిరత్వం ఎలా ఉంది? కార్మికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకున్నారా? వంటి అంశాలను అధికారులు ముందుగానే పరిశీలించాల్సి ఉండేదని ప్రజలు చెబుతున్నారు. కానీ అక్రమ నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి మూల్యం కూలీల ప్రాణాలతో చెల్లించాల్సి రావడం ఎంతవరకు సమంజసం? అని నిలదీస్తున్నారు.

వసూళ్లపైనే శ్రద్ధా?

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అధికారులు వసూళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది ఉన్నతస్థాయి విచారణలో తేలాల్సి ఉంది. కానీ ఇలాంటి ఆరోపణలు పదేపదే ఎందుకు వస్తున్నాయో కూడా అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. అక్రమ భవనాలను కూల్చివేయాల్సిన సమయంలో మాత్రం, సవాలక్ష కారణాలు, చెప్పే అధికారులు.. నిర్మాణాలు జరుగుతున్నప్పుడు మాత్రం ఎందుకు స్పందించడం లేదని అంజయ్యనగర్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రాజకీయ పలుకుబడి ఉన్నవారికో న్యాయం.. సామాన్యుడికో న్యాయమా?

రాజకీయ నాయకులు, పలుకుబడి ఉన్న వ్యక్తుల విషయంలో అధికారులు చూపుతున్న గౌరవం, సామాన్య ప్రజల సమస్యల విషయంలో ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ,సామాన్యుడి ప్రాణానికి విలువ లేదా? కూలీ ప్రాణం కేవలం రోజువారీ కూలీతోనే కొలవాలా?, అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 గజాల్లో ఏడు అంతస్తుల నిర్మాణం జరిగితే ఎందుకు స్పందించలేదని స్థానికులు నిలదీస్తున్నారు. 50 గజాల్లో ఏడు అంతస్తులు కట్టుకునే వెసులుబాటు ఉంటే.. విశాలమైన ప్రభుత్వ భవనాలు, ప్రజా అవసరాల కోసం స్థలాలు ఎందుకు?, అని అంజయ్యనగర్ వాసులు ప్రశ్నిస్తున్నారు..

మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు

చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం ఆగస్టు 22.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండల పరిధిలోని రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్ కు పిలిపించి శనివారం ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. రాబోవు ఎలక్షన్లలో ఎంపీటీసీ సర్పంచ్ ఎలక్షన్లలో ఏదైనా గొడవలు జరిగిన కేసులు నమోదైన వీరిపై కఠినమైన చర్యలు ఉంటాయని వారిని హెచ్చరించడం జరిగినట్లు తెలిపారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాల్లో కూడా పాల్గొన్న వారిపై తీవ్రమైన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అలా కాక అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎడల వారిని జిల్లా బహిష్కరణ కూడా నిర్వహించి వారిపై కఠినమైన చర్యలు తీసుకోనున్నట్లు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, రైటర్ రెడ్డప్ప పాల్గొన్నారు

అరగొండ జడ్పీ హైస్కూల్ నందు విద్యార్థులపై కుల వివక్ష చూపిన ఉపాధ్యాయుడు సునీల్ కుమార్ సస్పెండ్

హర్షం వ్యక్తం చేసిన జనసేన నాయకులు.

చిత్తూరు జిల్లా/ తవణంపల్లి ఆగస్టు 22.: చిత్తూరు జిల్లా,పూతలపట్టు నియోజకవర్గం,తవణంపల్లి మండల పరిధిలోని అరగొండ హై స్కూల్ నందు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సునీల్ కుమార్ ఈనెల 20వ తేదీన ఉదయం ప్రేయర్లో విద్యార్థుల పట్ల అత్యంత దారుణంగా బూతు పురాణాలతో,కులం పేరుతో దూషించిన ఘటన సర్వత్ర తీవ్ర దుమారం లేపిన సంగతి అందరికీ తెలిసిందే. దీనిపై మహేష్ స్వేరో,మరియు వివిధ ప్రజా సంఘాలు,దళిత బహుజన సంఘాలు,జనసేన మరియు ఇతర రాజకీయ పార్టీలు వెంటనే స్పందించి ఆ ఘటనను తీవ్రంగా ఖండించడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది.దీనిపై వెంటనే స్పందించిన చిత్తూరు జిల్లా డీఈఓ శనివారం విచారణ చేపట్టి విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించి వారి నుండి పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత,సునీల్ కుమార్ అనే ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల కులం పేరుతో దూషించినట్టు,వారి పట్ల అత్యంత అవమానకర రీతిలో ప్రవర్తించినట్టు ప్రాథమికంగా రుజువైనందున శనివారం సాయంత్రం డీఈఓ అతన్ని సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై స్వేరోస్ నాయకులు,దళిత,బహుజన సంఘాలు,జనసేన మరియు ఇతర రాజకీయ పార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తదుపరి ఇతనిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు తాము పోరాటం చేస్తామని జనసేన నాయకులు తెలిపారు .భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి ఘటనలకు పాల్పడకుండా తగిన రీతిలో బుద్ధి చెప్పే విధంగా చూస్తామని, అలాంటి వారిని శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించేలా కఠిన శిక్ష అమలయ్యే వరకు నిర్విరామ పోరాటం చేస్తామని,అలాంటి కులోన్మాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన అరగొండ హై స్కూల్ పూర్వ విద్యార్థులు,స్థానిక నాయకులు,పైమాఘం, చారాల, చెర్లోపల్లి మరియు పరిసర గ్రామాల యూత్,స్వేరోస్ నాయకులు,వివిధ దళిత ప్రజా సంఘాలు,జనసేన పార్టీ నాయకులు,బీఎస్పీ ఇతర రాజకీయ పార్టీలకు,మీడియా వారికి పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

తాళ్లరేవు, మహి న్యూస్, ఆగస్టు 22: తెలుగు చలనచిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కాపులపాలెం బైపాస్ జంక్షన్‌లో యానాం,మరియు బైపాస్ మెగా అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా అభిమానులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి, ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకుంటూ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిరంజీవి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారని అభిమానులు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడబాల శివ, వనచర్ల రామకృష్ణ, పుగాకు వాసు, ఖండవిల్లి నాని, వేదూరి రామకృష్ణ,తదితర మెగా అభిమానులు, అభిమాన సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యానంలో వివాహిత దారుణ హత్య.

భర్తను అరెస్ట్ చేసిన పోలీసులు

యానాం (మహి న్యూస్), ఆగస్టు 22:: యానాంలో వివాహిత దారుణ హత్య ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ హత్యకు దారితీసింది. యానాం భీమ్‌నగర్‌కు చెందిన పువ్వల రేఖ (26), కనకాలపేట ఫిషర్‌మెన్‌పేటకు చెందిన చెక్క అప్పారావు నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గొడవ తీవ్రమైంది. అప్పారావు తన భార్య రేఖ ఛాతిపై కూర్చొని ఊపిరాడకుండా చేసి, గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. హత్య అనంతరం మృతదేహాన్ని ఆటోలో మెట్టకూరు శివారు గణపతినగర్ బైపాస్ వద్ద ఆత్రేయ గోదావరి నదిలో పడేశాడు. అనంతరం తన భార్య కనిపించడం లేదంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అప్పారావు ప్రవర్తనపై అనుమానం రావడంతో పోలీసులు విచారించగా, తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్సై పట్టాభి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కోసం స్థానిక మత్స్యకారులతో ఆత్రేయ గోదావరి నదిలో గాలింపు చేపట్టగా నది ఒడ్డున మృతదేహం తెలియాడుతు కనిపించింది. మృతదేహాన్ని పోలీసులు బయటకు తీసి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. తన మాట వినకుండా ప్రేమ వివాహం చేసుకున్న కుమార్తె హత్యకు గురికావడంతో ఆమె తండ్రి పువ్వల రమేష్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

ప్రతి భక్తుడు సంతృప్తిగా భగవంతుడి దర్శనం చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు ఉండాలి.
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్.
100 సీసీ కెమెరాలను కొనుగోలు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము.
అగమ శాస్త్రాల ప్రకారమే స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది.
కాణిపాకం నుండి ప్రతి పది నిమిషాలకు, చిత్తూరుకు ఆర్టీసీ బస్సులు నడపాలి.
కాణిపాక బ్రహ్మోత్సవాల సమయంలో మెడికల్ ఆధ్వర్యంలో నిరంతరం వైద్య సిబ్బంది, అంబులెన్స్, అందుబాటులో ఉండాలి.
స్థానిక పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్.
కాణిపాక బ్రహ్మోత్సవాల సమయంలో పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నాము.
జిల్లా ఎస్పీ తుషార్ డ్యూడి.

చిత్తూరు జిల్లా/ కాణిపాకం, ఆగస్టు 22: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కాణిపాకంబ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారంకాణిపాకం ఆలయ ఈఓ కార్యాలయంలోని

సమావేశ మందిరంలో శ్రీ కాణిపాక వరసిద్దివినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మురళి మోహన్, చిత్తూరు ఎస్పి తుషార్ డ్యూడి ,ఈ ఓ పెంచల కిషోర్, ఆలయ చైర్మన్ మణి నాయుడు , బోర్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 14 నుండి అక్టోబర్ 10 వరకు శ్రీ కాణిపాక వరసిద్ది వినాయకస్వామి వారి వార్షిక బ్రహ్మోత్స వాలు నిర్వహించడం జరుగుతుందని రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి పొరబాట్లు జరగకుండా భక్తులకు మంచి దర్శనం కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కాణిపాక ఆలయగేటు వద్ద గట్టి భద్రత చర్యలు చేపట్టాలి. విద్యుత్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఫైర్ అధికారులు 24/7 విధులు నిర్వహించవలెనని తెలిపారు.రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి పొరబాట్లు జరగకుండా భక్తులకు మంచి దర్శనం కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు,ఆర్డీవో, డి.ఎస్.పి, ఆలయ ఈవో ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పది కాలాలపాటు భక్తుల గుండెల్లో నిలిచిపోయేలా బ్రహ్మోత్సవాలను నిర్వహించు కోవడం మనందరి బాధ్యత అని తెలియజేశారు. అవసరమైన ఏర్పాట్లకు సంబంధించి ఆలయ ఈఓ అధ్యక్షతన సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీ ద్వారా ప్రాథమిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ఆలయ ఈవో, విద్యుత్ అధికారులు, ఫైర్ ఆఫీస్ అధికారులు సమగ్రంగాఆలయం వెలుపల, ఆలయంలోపల విద్యుత్ సౌకర్యం ఎలా ఉన్నది, పరిశీలించిసిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాహనం తిరిగే సమయంలో విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణ కలిగి ఉండాలని ఆదేశించారు. చిత్తూరు ఆర్డిఓ ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రోటోకాల్లో ఎమ్మార్వోలను, డిప్యూటీ ఎమ్మార్వోలనువిధులు నిర్వహించడానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయుచు న్నామని తెలిపారు. చిత్తూరు ఆర్డీవో పర్యవేక్షణలోపై కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఉత్సవాలల్లో ఎలాంటిపొరబాట్లు జరగ కుండా జాగ్రత్తగా మీ విధులు నిర్వర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాలు సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, అంబులెన్సులు, నైపుణ్యం కలిగిన డాక్టర్లను నియమిం చాలని డి ఎం హెచ్ ఓ ఆదేశించారు. డిపిఓ ఆధ్వర్యంలో కాణిపాక ఆలయ పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని డిపిఓను ఆదేశించారు. కాణిపాక నగరంలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు యాలని, భక్తులకు సురక్షితమైన తాగునీరు అందజేయాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు అధిక సంఖ్యలో నడపాలని ఆదేశించారు. ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రం ఉండే విధంగా జిల్లా పంచాయతీ అధికారి, గ్రామపంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు సందర్భంగా డ్రోన్ కెమెరాలు, మ్యాక్ ప్యాక్ లు ఏర్పాటు చేసుకుని ఆలయ పరిసర ప్రాంతాలలో గట్టి భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్యూ లైన్స్ నందు వేచి ఉండే భక్తులకు అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు అత్యవసర చికిత్స అందించుటకు అంబులెన్సు, వీల్ చేర్స్ అందుబాటులో ఉండాలి. నిరంతరం విద్యుత్ సరఫరా కొరకు అవసరమైన ఎడల కొత్తగా ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదాలు జరుగు ప్రదేశములను ఆలయ పరిసర ప్రాంతాలలో ముందుగా గుర్తించి తగు జాగ్రత్త తీసుకోవాలి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఆనవాయితీగా నిర్వహించుచున్న వివిధ వాహన సేవలో న మయములందు ఉభయ దారుల సంప్రదాయాన్ని అనుసరించి రాత్రి 7 గంటల నుంచి వాహన సేవలు ప్రారంభించి రాత్రి 12 గంటల లోపల తిరిగి ఆలయానికి చేరే విధంగా వాహనాలు తిరగాలని పేర్కొన్నారు. త్వరలో 100 సీసీ కెమెరాలను కొనుగోలు చేయుటానికి చర్యలు చేపట్టడం జరుగుతుంది. కాణిపాకం నుండి ప్రతి పది నిమిషాలకు, చిత్తూరుకు ఆర్టీసీ బస్సులు నడపాలి అని తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ కాణిపాక బ్రహ్మోత్సవాల సమయంలో పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దేవాలయ ప్రాంగణము, సుపద మండపం, కోనేరు, బస్టాండు, కళ్యాణ కట్ట, ఆలయ పరిసర ప్రాంతాలలో ముఖ్య ప్రదేశాలలో రథోత్సవము, పుష్ప పల్లకి ఉత్సవములు సందర్భంగా తగినంత పోలీసు భద్రత సిబ్బంది నియమించడం జరుగుతుందని తెలిపారు.సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసుకుని24 గంటలకు పోలీసులు విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణినాయుడు, ఆలయ కమిటీ మెంబర్లు,ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా ఫైర్ ఆఫీసర్, ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెంట్ ఇంజనీర్, ఎస్పీడీఎస్ఎల్, డిఎం హెచ్ఓ, డీపీవో , ఆర్టీవో , ఆర్టిసి డిపో మేనేజర్, పి ఆర్ ఉ ఆర్ అండ్ బి ఇంజనీర్లు, సంబంధిత డీఎస్పీలు, జిల్లా లోని ఈ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెమోలు మామూలే - నిత్యం నిర్లక్ష్యమే

నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో క్రమశిక్షణకు తాళం.

నాయుడుపేట, ఆగష్టు 22, మహి న్యూస్: నాయుడుపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. 2024 వ సంవత్సరం నుంచి పలువురు వైద్య సిబ్బందికి అనేకసార్లు మెమోలు జారీ చేసినట్లు సమాచారం. గత రెండున్నర ఏళ్లలో 13 మంది నాయుడుపేట సి హెచ్ సి వైద్య సిబ్బంది విధులకు ఆలస్యం చేత మెమోలు తీసుకున్నట్లు తెలుస్తుంది. అయితే అదే ఉద్యోగులు తిరిగి తరచూ ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా కేవలం మెమోలు జారీ చేయడమే తప్ప కఠిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనితో ప్రజా సేవలో నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారనే అభిప్రాయం బలపడుతోంది.

వైద్య సిబ్బంది ఆలస్యానికి అలసిపోతున్న రోగులు.

వైద్య సిబ్బంది ఆలస్యంగా రావడం వల్ల రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు నాయుడుపేట సి హెచ్ సి లో ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర సేవలు అవసరమైన సందర్భాల్లో కూడా కష్టాలు తలెత్తుతున్నాయనే ఆందోళనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే పేద ప్రజలే ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. సమయానికి వైద్యం అందకపోతే ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. అందుకే సమయపాలన విషయంలో రాజీ ఉండకూడదని ప్రజలు కోరుతున్నారు.

పాలకులపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి.

ప్రభుత్వ ఉద్యోగుల నిర్లక్ష్య ధోరణిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పన్నుల రూపంలో ప్రజల నుంచి వచ్చే ధనంతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చూపించడం మాత్రమే సరిపోదని అభిప్రాయపడుతున్నారు. తప్పిదాలు పునరావృతమైతే మరింత కఠినమైన చర్యలు అవసరమని అంటున్నారు. లేకపోతే ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు.

పక్క రాష్ట్రాలు పరుగులు.. మనం వెనుకడుగు.

దేశంలోని పలు రాష్ట్రాలు ఆరోగ్య సేవల మెరుగుదల కోసం కొత్త విధానాలను అమలు చేస్తున్నాయి.

సమయపాలన, సేవల నాణ్యత, బాధ్యతాయుత పరిపాలనలో పోటీ పడుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్య ఘటనలు వెలుగుచూడడం అత్యంత బాధాకరం. ఇవి పరిపాలనా వైఫల్యాలకు ప్రతీకలుగా మారుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా ఉత్తమ సేవల దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

కంటితుడుపు చర్యలా? కఠిన చర్యలా?

పదేపదే ఒకే తప్పిదం చేస్తున్న నాయుడుపేట సి హెచ్ సి వైద్య ఉద్యోగులపై కేవలం మెమోలతో సరిపెట్టడం సరైన విధానమా అనే ప్రశ్నలు స్థానిక ప్రజానీకంలో పలువార్లు తలెత్తుతున్నాయి. హెచ్చరికలు ఫలితం ఇవ్వనప్పుడు శాఖాపరమైన కఠిన చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. బాధ్యతారాహిత్యాన్ని సహించే ధోరణి మరింత నిర్లక్ష్యానికి దారితీసే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ప్రజా సేవల్లో జవాబుదారీతనం పెంచేందుకు కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పనిసరి అని సూచిస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే మాటలకంటే చర్యలే ముఖ్యమని ప్రజలు హితవు పలుకుతున్నారు.

శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న సమారాధన...

యానాం, మహి న్యూస్, ఆగస్టు 22,: కేంద్రపాలిత ప్రాంతమైన యానంలో రెడ్డి రాజుల కాలం నాటి అతి పురాతన ఆలయమైన శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో

భాగంగా ఈ శనివారం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. దాతలు కంచర్ల శ్రీనివాస్, ఎన్. గోపి వాసు, సుంకర రామచంద్రరావు, మొదుసూరి సహదేవరాజు, గిల్లా కృష్ణవేణి, భక్తుల సహాయ సహకారంతో సుమారు 1,400 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రఘురామ వినోద్ ఆచార్యులు మాట్లాడుతూ.. ప్రతి శనివారం దాతలు, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు, భక్తులకు ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

చిలకలూరిపేట: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

ఎడ్లపాడు సెయింట్ ఆన్స్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఉమెన్స్ కాలేజీలో కార్యక్రమం.

ముఖ్య అతిథి గా చిలకలూరిపేట రూరల్ సీ.ఐ. బి. సుబ్బానాయుడు.

పల్నాడు జిల్లా చిలకలూరిపేట:ఆగస్టు-22. జిల్లా ప్రతినిధి:- సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగంపై విద్యార్థినులకు అవగాహన. డా. కె. తేజస్విని ఆధ్వర్యంలో బాలికల ఆరోగ్యం, గైనిక్ హైజీన్పై అవగాహన.డా. వై. మధులత ఆధ్వర్యంలో మానసిక సమస్యలు, వాటిని అధిగమించే విధానాలపై అవగాహన. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మల ప్రీతి కార్యక్రమానికి సహకారం. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహణ. రోటరీ క్లబ్ అధ్యక్షులు బోడి రామ సుబ్బారావు, కార్యదర్శి మనం శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థినుల్లో సైబర్ భద్రత, ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని రోటరీ ప్రతినిధుల వెల్లడి.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com , website : https//epaper.mahinewsindia.com